దళిత సర్పంచి పట్ల వివక్ష..

- వేదిక కిందే నిలబెట్టిన బిజెపి ఎమ్మెల్యే
- 'కూటమి' నాయకుల సమక్షంలో ఘటన
- ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రజా సంఘాలు

ప్రజాశక్తి-ఆదోని రూరల్

ఆదోని మండలం ఢణాపురం గ్రామ దళిత సర్పంచి పట్ల బిజెపి ఎమ్మెల్యే పార్థసారథి వివక్ష చూపారు. సభలో వేదిక పైకి సర్పంచిని పిలవకుండా బిజెపి ఎమ్మెల్యే కిందే నిలబెట్టారు. 'కూటమి' నాయకుల సమక్షంలోనే ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. ఈ నెల 16న ఆదోని మండలం ఢణాపురం గ్రామంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై సంబరాల కార్యక్రమం నిర్వహించారు. ఆదోని బిజెపి ఎమ్మెల్యే పార్థసారథి, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ సభ్యులు గుడిసె ఆది కృష్ణమ్మ, మాజీ సర్పంచి మల్లికార్జున, కూటమి నాయకులు హాజరయ్యారు.

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి సర్పంచి చంద్రశేకర్ దళితుడు కావడంతో వివక్ష చూపుతూ కిందే నిలబెట్టిన దృశ్యం(ఫైల్)

స్థానిక దేవాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. దేవాలయం కట్టపై ప్రజాప్రతినిధులు ఉండగా స్థానిక సర్పంచి చంద్రశేఖర్ కింద నిలబడ్డారు. సభలో ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ... సర్పంచిని పైకి రమ్మని పిలిచారు. 'సర్పంచి ఎస్సీ. ఆయన రాకూడదు' అని టిడిపి మాజీ ఇన్‌ఛార్జి గుడిసె ఆది కృష్ణమ్మ ఎమ్మెల్యే చెవిలో చెప్పారు. దీంతో ఎమ్మెల్యే సర్పంచి చంద్రశేఖర్‌ను కిందనే ఉండాలంటూ చేతితో సైగ చేసి అక్కడే నిలబెట్టారు. గ్రామ ప్రథమ పౌరునిపైనే ఇంత వివక్ష చూపుతుంటే, ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రజాసంఘాల నాయకులు మండిపడుతున్నారు. దళిత సర్పంచి పట్ల చూపిన వివక్షను నిరసిస్తూ గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. ఆదోని ఎమ్మెల్యే, టిడిపి నాయకురాలు గుడిసె ఆది కృష్ణమ్మపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయ అరుగుకట్ట సాక్షిగా అంటరానితనం

- చట్టబద్ధమైనదే అన్నట్లుగా వ్యవహరించిన కూటమి నేతలు
- రెడ్‌బుక్ రాజ్యాంగం చాటున కులవివక్ష - దళిత సర్పంచును అవమానించడం దారుణం
- ఆదోని బిజెపి ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
- కెవిపిఎస్ ఆధ్వర్యంలో సుందరయ్య సర్కిల్‌లో, కలెక్టరేట్ ఎదుట నిరసనలు

ఆదోని ఎమ్మెల్యే, టిడిపి నాయకురాలుపై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ వద్ద గాంధీ విగ్రహం ఎదుట కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపడుతున్న నాయకులు

సుందరయ్య సర్కిల్‌లో నిరసన చేపడుతున్న కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్/కలెక్టరేట్

ఆదోని మండలం ఢణాపురం గ్రామంలో ఈ నెల 16న కూటమి ప్రభుత్వ ఏడాది పాలన సంబరాల్లో దళిత సర్పంచి చంద్రశేఖర్‌ను ఆలయ అరుగు కట్ట సాక్షిగా అవమానించడం దారుణమని కెవిపిఎస్ న్యూ సిటీ, ఓల్డ్ సిటీ కమిటీల నేతలు పేర్కొన్నారు. దళిత సర్పంచి చంద్రశేకర్ ఆలయ అరుగుకట్ట ఎక్కకూడదంటూ ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి కాళ్ల ముందర స్థలాన్ని చూపిస్తూ అక్కడే నిలబడాలంటూ అవమానించడాన్ని నిరసిస్తూ కెవిపిఎస్ న్యూ సిటీ, ఓల్డ్ సిటీ కమిటీల ఆధ్వర్యంలో సుందరయ్య సర్కిల్‌లో, కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కెవిపిఎస్ ఓల్డ్ సిటీ ఆధ్వర్యంలో కర్నూల్ కలెక్టరేట్ గాంధీ విగ్రహం ముందర నిరసన కార్యక్రమం చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట జరిగిన కార్యక్రమంలో ఓల్డ్ సిటీ నగర అధ్యక్ష కార్యదర్శులు ఆర్.రమణ, ఏ.గురుస్వామి, ఉపాధ్యక్షులు రామాంజనేయులు, ఎన్‌జి.కృష్ణ మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ భారతదేశంలో కొనసాగుతోందన్నారు. ప్రస్తుతం బిజెపి, టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వంలో దళితులపైన దాడులు, దౌర్జన్యాలు, కుల వివక్ష, అంటరానితనం రోజు రోజుకు పెరిగిపోవడం దారుణమన్నారు. ఆదోని మండలం ఢణాపురం గ్రామంలో జరిగిన కూటమి ప్రభుత్వం ఏడాది సంబరాల్లో భాగంగా దేవాలయ అరుగుకట్టపై నిర్వహించిన సభ వేదికపైకి గ్రామ ప్రథమ పౌరుడైన సర్పంచ్ చంద్రశేఖర్ దళితుడు కాబట్టి పిలవకుండా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడ్డారన్నారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ మధ్యలో సర్పంచి వేదికపైకి రావాలని కోరగా టిడిపి ఇన్చార్జి గుడిసె క్రిష్ణమ్మ సర్పంచి ఎస్సీ కులమని ఎమ్మెల్యే చెవిలో చెప్పడం, ఎమ్మెల్యే వెంటనే తన చేతిని కాళ్ల ముందర ఉన్న ప్రాంతాన్ని చూపిస్తూ, అక్కడే నిలబడాలంటూ సర్పంచికి చెప్పడం అంటరానితనాన్ని, కులవివక్షను ప్రోత్సహించడమేనని అన్నారు. ఈ దుర్మార్గమైన ఘటనకు కారణమైన టిడిపి ఇన్చార్జ్ గుడిసె క్రిష్ణమ్మ, ఎమ్మెల్యే పార్థసారథి, వేదికపై ఉన్న వాల్మీకిలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఈ ఘటనకు భేషరతుగా క్షమాపణలు చెప్పి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ ఘటనపై స్పందించి, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొని ఎమ్మెల్యేను సస్పెండ్ చేయాలని, లేని పక్షంలో కలిసొచ్చే ప్రజా సంఘాలను కలుపుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. వివక్ష, అంటరానితనం కొనసాగుతున్న ప్రాంతాలలో ఆదోని ఒకటని, కర్నూల్ జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మార్వో, ఉన్నతాధికారులు ఈ ప్రాంతంపై ప్రత్యేకంగా దృష్టి సారించి అంటరానితనం నిర్మూలన కృషి చేయాలని కోరారు. అలాగే సుందరయ్య సర్కిల్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో న్యూసిటీ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్, యేసురాజు మాట్లాడారు. కార్యక్రమంలో నగర నాయకులు ఆర్.కృష్ణ, నాగరాజు, నాగస్వాములు, సాల్మోను, బజారి, శ్రీనివాసులు, రాజు, శేఖర్ లక్ష్మన్న, అశోక్, బతుకన్న, జానీ, పెద్దకర్ణ, వెంకటస్వామి, రమేష్, హెచ్, శీను తదితరులు పాల్గొన్నారు.

ఆదోని ఎమ్మెల్యే, టిడిపి నాయకురాలిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఆదోని మండలం ఢణాపురం గ్రామంలో ఈ నెల 16న కూటమి ప్రభుత్వ ఏడాది పాలన సంబరాల సభలో దళిత సర్పంచి చంద్రశేఖర్‌ను అవమానించిన బిజెపి ఎమ్మెల్యే పార్థసారథి, టిడిపి నాయకురాలు గుడిసె ఆది క్రిష్ణమ్మలపై ఎస్‌టి, ఎస్‌సి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బహిరంగ సభ వేదికపై (కట్ట) సర్పంచి దళితుడు కాబట్టి రాడులే అని ఎమ్మెల్యే సంబోధిస్తూ సభ నిర్వహించడం దారుణమన్నారు. వీధుల్లో తిరుగుతూ, నడి వీధిలో ఉన్న గుడి దగ్గర కట్టను దళితులు ఎక్కరాదన్న వివక్షలో భాగంగా దళితుడైన సర్పంచి చంద్రశేఖర్‌ను జనంలో ఒకడిగా బయటే నిలబెట్టడం దారుణమని పేర్కొన్నారు. వైసిపి నుండి గెలిచిన సర్పంచి ఎమ్మెల్యే ఎన్నికల అనంతరం బిజెపి కండువా కప్పుకున్నారని, అయినా సరే వేదిక కింద పెట్టి అవమానించడం బిజెపికి దళితుల పట్ల ఉండే వైఖరికి నిదర్శనమన్నారు. సభ దగ్గర ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడే మధ్యలో సర్పంచికు సంబంధించి ప్రస్తావన చేస్తూ, క్రిస్టియనా అని అడిగారని, ఎస్సీ కాబట్టి వేదికపైకి రాడని గుడిసె క్రిష్ణమ్మ గుసగుసగా చెప్పడం, దానికి ఎలాంటి రియాక్షన్ లేకుండానే ఎమ్మెల్యే మిన్నకుండం చూస్తే దళితుల పట్ల బిజెపి వైఖరి స్పష్టంగా కనబడుతుందని విమర్శించారు. నోటితో రమ్మని పిలిచి, చేతితో కిందే నిల్చోమని చూపడం వీడియోలో స్పష్టంగా కనిపిస్తోందని, అంటరానితనాన్ని అక్షరాల పాటించారని చెప్పడానికి ఇది సంకేతమన్నారు. ఏడాది పాలనలో ఏడాది పాలనలో ఏం సాధించారో తెలియదు కానీ, రాజ్యాంగ హక్కులను గౌరవించి, సాటి మనిషిని మనిషిగా చూడటాన్ని మాత్రం గడ్డకు తోసారని విమర్శించారు. ఆదోని మండలంలో ఇప్పటికీ అనేక చోట్ల వివిధ రూపాల్లో కులవివక్ష కొనసాగుతోందన్నారు. దీనిని అరికట్టాల్సిన బాధ్యత ఉందన్నారు. సమాజంలో బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా ఉన్న ఎమ్మెల్యే పార్థ సారథిపై, ప్రధాన రాజకీయ పార్టీ నాయకురాలు గుడిసె క్రిష్ణమ్మపై సుమోటోగా ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

చదువు'కొనాల్సిందే'..

- ఫీజుల పేరుతో దోచుకుంటున్న ప్రైవేటు విద్యాసంస్థలు
- ఖాళీ అవుతున్న సామాన్యుల జేబులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రైవేటు పాఠశాలల్లో సరైన సౌకర్యాలు, క్రీడా మైదానాలు లేకపోయినా నిర్వాహకులు ఫీజుల మోత మోగిస్తున్నారు. అడ్మిషన్ ఫీజు పేరుతో రూ.2వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారు. దీనికి తోడు ట్యూషన్ ఫీజు, స్పెషల్ ఫీజు, స్కూల్ డెవలప్‌మెంట్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ఫీజు, స్మార్ట్ క్లాసులు.. ఇలా అన్నింటికీ ఫీజులు పిండేస్తున్నారు. కొత్తగా అడ్మిషన్ తీసుకుంటే రెగ్యులర్ ఫీజుతోపాటు అదనపు భారాన్ని మోయాల్సిందే. పుస్తకాలు, యూనిఫాం, బెల్టు, షూ కూడా తమ పాఠశాలలోనే కొనుగోలు చేసేలా నిబంధన విధిస్తున్నారు. వాటి పేరిట మరి కొంత దోచేస్తున్నారు. ఒకటో తరగతి నుంచి ఐదోతరగతి వరకు పాఠ్య పుస్తకాలను రూ.10 వేల నుంచి రూ.12 వేలకు విక్రయిస్తున్నారు...

కర్నూలు జిల్లాలో 745 ప్రయివేటు పాఠశాలలు ఉన్నాయి. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులపై అధ్యయనం చేయడానికి ఐఎఎస్ అధికారులతో గతంలో ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. ఏ పాఠశాలలో ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో ప్రాంతాల వారీగా ఈ కమిటీ పరిశీలించి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందించింది. పాఠశాలల్లో మౌలిక వసతులు, బోధన, బోధనేతర సిబ్బంది తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని గ్రామాలు, పట్టణాల్లో పాఠశాలలను ఐదు కేటగిరీలుగా విభజించారు. స్టార్ రేటింగ్ స్కూల్స్‌కు 1 నుంచి 10వ తరగతి వరకు ఫీజులు కూడా నిర్ధారిస్తూ ఈ కమిటీ సిఫారసు చేసింది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒకటో తరగతి నుండి మూడో తరగతి వరకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.6వేలు, మండల కేంద్రాల్లో ఉన్న పాఠశాలల్లో రూ.7,500, పట్టణాల్లో 8,600, జిల్లా కేంద్రంలో రూ.10వేలు చొప్పున ఫీజులు నిర్ధారించారు. 4 నుంచి 5 తరగతులకు గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.9వేలు, పట్టణాల్లో రూ.10,500, జిల్లా కేంద్రంలో రూ.12వేలు, ఆరో తరగతికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.9వేలు, మండల కేంద్రాల్లో రూ.9,500, పట్టణాల్లో రూ.11,100 పాఠశాల స్టార్ రేటింగ్ మేరకు ఈ ఫీజులను నిర్ణయించారు. కానీ నర్సరీకే ప్రయివేటులో రూ.13 వేల నుంచి రూ.25 వేల వరకూ, కార్పొరేట్‌లో రూ.35 వేల నుంచి రూ.40 వేలు వసూలు చేస్తున్నారు. ఐదో తరగతికి ప్రయివేటులో రూ.20 వేల నుంచి రూ.30 వేలు, కార్పొరేటులో రూ.50వేలకు పైనే వసూలు చేస్తున్నారు. ఫీజు వసూలు, సౌకర్యాల వంటి వివరాలను నోటీసు బోర్డులో ప్రదర్శించాలి. కానీ ఈ నిబంధనలను ప్రైవేటు పాఠశాలలు పాటించడం లేదు. సిలబస్ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ముద్రించే పుస్తకాలను బోధించాలి. కానీ కొన్ని పాఠశాలల్లో ఒక్కొక్క పబ్లికేషన్ పుస్తకాలను ఐటీఐ ఒరియంటెడ్ పేరుతో విక్రయిస్తూ వాటినే బోధిస్తున్నారు. ఆరోతరగతి నుంచి తొమ్మిదోత రగతి వరకు ఇంటర్‌స్థాయిలో ఉండే సిలబస్‌ను జోడించి సొంతంగా పుస్తకాలను విక్రయిస్తున్నారు. నిబంధనలు పాటించని పాఠశాలలను విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

ఫీజు నియంత్రణ చట్టం పటిష్టంగా అమలు చేయాలి

ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఏ ప్రయివేటు పాఠశాలా ఫీజులను వసూలు చేయడం లేదు. అధికంగా వసూలు చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు కూడా ప్రయివేటు, కార్పొరేటు యాజమాన్యాలకే వత్తాసు పలికే విధంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదివించాలని కోరిక ఉన్న తల్లిదండ్రులను ఫీజులను చూసి భయపడుతున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు, విద్యా శాఖ మంత్రి స్పందించి ఫీజు నియంత్రణ చట్టం పటిష్టంగా అమలు చేసేలా చూడాలి. అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి.

- ఎస్ అబ్దుల్లా, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

ప్రయివేటు పాఠశాలలు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారమే ఫీజులను వసూలు చేయాలి. అలా కాకుండా ఇష్టానుసారంగా ఫీజులను వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. అలా ఎక్కడైనా అధిక ఫీజులు వసూలు చేస్తుంటే మా దృష్టికి తీసుకురావచ్చు.

- శామ్యూల్ పాల్, కర్నూలు డిఈఓ.

యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఈ నెల 21న జిల్లా అంతటా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. యోగా దినోత్సవ నిర్వహణపై గురువారం మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపిడిఓలు, తహసీల్దార్లు తదితరులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21న అన్ని వేదికల్లో కచ్చితంగా ఉదయం 7 గంటలకు యోగా కార్యక్రమం ప్రారంభం కావాలని అధికారులను ఆదేశించారు. ఉదయం 6.15 గంటలకు వెన్యూలో అంతా సిద్ధంగా ఉండాలని సూచించారు. యోగా చేసేందుకు మ్యాట్స్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు.

తాగునీరు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. ఏర్పాట్ల కోసం నిధులు విడుదల చేశామని, ఎలాంటి లోపాలు ఉండకూడదన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న పౌరులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మెడికవర్ హాస్పిటల్‌కు జీవన్‌దాన్ లైసెన్స్

- అందజేసిన కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

లైసెన్స్ అందజేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు నగరంలోని మెడికవర్ హాస్పిటల్‌కు జీవన్‌దాన్ లైసెన్స్ మంజూరైంది. కిడ్నీ మార్పిడి (మూత్రపిండ మార్పిడి) చికిత్సలు నిర్వహించడానికి అవసరమైన లైసెన్స్‌ను కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆస్పత్రి సిబ్బందికి గురువారం అందజేశారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ, మెడికవర్ హాస్పిటల్స్‌కు కిడ్నీ మార్పిడి లైసెన్స్ లభించడం నిజంగా అభినందనీయమని, దీని ద్వారా కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న ఎంతో మంది రోగులకు స్థానికంగానే అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. మెడికవర్ హాస్పిటల్స్ కర్నూలు సెంటర్ హెడ్ మహేశ్వర్ రెడ్డి, యూరాలజిస్ట్ డాక్టర్ అబ్దుల్ సమద్, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సిద్ధాంత్ హేరూర్ మాట్లాడుతూ కిడ్నీ మార్పిడి లైసెన్స్ పొందడం మెడికవర్ హాస్పిటల్స్ మరియు కర్నూలుకు ఒక మైలురాయి అని తెలిపారు. ఇది మా ఆసుపత్రి వైద్య రంగంలో ఉన్న నిబద్ధతను, నాణ్యమైన సేవలను అందించాలనే మా సంకల్పాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ఈ సేవలను విజయవంతంగా అందించడానికి మా బృందం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కర్నూలు, పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ అందించడానికి మేము కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. మెడికవర్ హాస్పిటల్స్, కర్నూలు అత్యాధునిక మౌలిక సదుపాయాలు, నిపుణులైన వైద్యులు, నర్సులు మరియు ఇతర సహాయక సిబ్బందితో కిడ్నీ మార్పిడి చికిత్సలను విజయవంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసిందన్నాడు. ఈ కొత్త సౌకర్యం జిల్లా ఆరోగ్య రంగానికి గణనీయమైన కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే పార్థసారథిని బర్తరఫ్ చేయాలి

- డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

దళిత సర్పంచిని అవమానించిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిని బర్తరఫ్ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర డిమాండ్ చేశారు. గురువారం కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి కులం పేరుతో మతం పేరుతో రాజకీయం చేస్తూ ప్రజల మధ్య గొడవలు పెడుతూ ఐక్యత దెబ్బతీస్తుందని అన్నారు. బహిరంగంగా దళిత సర్పంచ్ని అవమానించిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిని బర్తరఫ్ చేయాలని, టిడిపి నాయకురాలు గుడిసె కృష్ణమ్మను పార్టీ నుండి సస్పెండ్ చేసి వారిద్దరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కులం పేరుతో మతం పేరుతో రాజకీయాలు చేసే పార్టీలకు బుద్ధి చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డివైఎఫ్ఐ గ్రామ కార్యదర్శి హరికిషన్ రెడ్డి, గ్రామ నాయకులు రాము, హరి, విశ్వనాథ్, రఘువరన్, హరి, మోహన్ పాల్గొన్నారు.

నకిలీ ఎరువులు, పురుగు మందులు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి - సి బెళగల్

రైతులకు నకిలీ ఎరువులు, పురుగు మందులు అంటగడితే చర్యలు తప్పవని ఎఓ మల్లేష్ కుమార్ హెచ్చరించారు. గురువారం కొత్తకోట, గుండ్రేవుల గ్రామాల్లో ఎరువుల, మందుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ బోర్డును, స్టాక్ వివరాలను, బిల్లు రికార్డులను పరిశీలించారు. నాణ్యమైన ఎరువులు, పురుగు మందులనే తెచ్చుకొని రైతులకు అమ్మాలని తెలిపారు. ఎంఆర్‌పి ధరలకే ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సికిల్ సెల్ అనీమియాపై అవగాహన అవసరం

- డిఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతి కళ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

సికిల్ సెల్ అనీమియా వ్యాధి అనేది ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిని ప్రభావితం చేసే జన్యు రుగ్మత సంబంధిత వ్యాధి అని, దీనిపై అవగాహన అవసరమని డిఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతి కళ తెలిపారు. గురువారం ఓల్డ్ లెక్చరర్ గ్యాలరీలో సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతేడాది జూన్ 19న ప్రపంచ సికిల్ సెల్ అనీమియా వ్యాధి అవగాహన దినోత్సవం జరుపుకుంటామని తెలిపారు. ఇది రక్తానికి సంబంధించిన ఒక వారసత్వ వ్యాధి, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడం ముఖ్యమని తెలిపారు. ఈ వ్యాధిలో ఎర్ర రక్త కణాలు సాధారణం మాదిరిగా గుండ్రంగా కాకుండా కొడవలి ఆకారంలో మారిపోతాయని, దీనివల్ల రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడి, శరీర భాగాలకు ఆక్సిజన్ సరఫరా తగ్గిపోతుందని చెప్పారు. తీవ్రమైన నొప్పి, రక్తహీనత, అలసట, కామెర్లు, తరచుగా ఇన్ఫెక్షన్ రావడం వంటివి ఈ వ్యాధి లక్షణాలని తెలిపారు. వివాహం చేసుకోవాలనుకునే జంటలు పెళ్లికి ముందు రక్త పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఈ వ్యాధి సంక్రమ ప్రమాదాన్ని తెలుసుకోవచ్చని చెప్పారు. వ్యాధి నిర్ధారణ అయిన వారు క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించి, సరైన చికిత్స తీసుకోవాలని సూచించారు. సికిల్ సెల్ అనీమియా వ్యాధి ఎక్కువగా ట్రైబల్ ఏరియాలో నివసించే ప్రజలకు సంక్రమిస్తుందని తెలిపారు. ఈ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం అన్ని రకాల సహాయం అందించడానికి వివిధ రకాల అవగాహన స్క్రీనింగ్ కార్యక్రమాలను చేపడుతోందని, ప్రజలు సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. లక్షణాలుంటే వైద్యులను సంప్రదించి తగిన సూచనలు, చికిత్స పొందాలని సూచించారు. సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు అన్ని పిహెచ్‌సిలలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. జిల్లా కుష్టు ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్, అతిథిగా డిప్యూటీ డైరెక్టర్ ఎపిఎస్‌ఎసిఎస్ డాక్టర్ శ్రీనివాస శర్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ శాంతి కళ

నేడు ఆటో యూనియన్ న్యూ సిటీ నగర మహాసభ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు కార్మిక కర్షక భవన్‌లోని సిఐటియు కార్యాలయంలో శుక్రవారం ఆటో యూనియన్ న్యూ సిటీ 3వ నగర మహాసభ నిర్వహించనున్నట్లు ఏపీ ఆటో ట్రాలి డ్రైవర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ తెలిపారు. న్యూ సిటీ పరిధిలో ఉన్న ఆటో కార్మికులు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. బళ్లారి చౌరస్తా చెగువేరా ఆటో స్టాండ్, కొత్త బస్టాండ్ ఇన్ గెట్ ఆటో స్టాండ్ ఆటో డ్రైవర్ల సమావేశం కార్మిక కర్షక భవన్‌లో గురువారం నిర్వహించారు. ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, ఆటో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బి రాధాకృష్ణ, ఆటో యూనియన్ అధ్యక్షులు హుస్సేన్ వలీలు మాట్లాడుతూ నరేంద్ర మోడీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు లక్షలాదిగా ఉన్న కార్మిక రవాణా రంగంపై పెనుభారాలుగా మారాయని వివిధ రకాల జీవోలు న్యాయ చట్టాల వల్ల జైలు జీవితాలు లక్షలాది రూపాయలు ఫైన్లు చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. కార్మిక రైతు రవాణా రంగ వ్యతిరేక విధానాలపై ఈ మహాసభలో చర్చించి రానున్న కాలంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామ ని తెలిపారు. దేశవ్యాప్త సమ్మె జూలై 9న జరుగుతున్న దని ఈ సమ్మెకు సంఘీభావంగా ఆటోలు బంద్ కార్యక్రమాన్ని కూడా చేపడతామని తెలిపారు. అనంతరం బళ్లారి చౌరస్తా చేగువేరా ఆటో స్టాండ్ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా విజయ్ ఉపాధ్యక్షులుగా మధు, అన్వేష్ ప్రధాన కార్యదర్శిగా నబి, సహాయ కార్యదర్శిగా నరస ప్ప, నాగరాజు, ఆరుగురు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న నాయకులు

ఒకేషనల్ కళాశాలలో యోగాంధ్ర

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని బిక్యాంప్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో గురువారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నాగ స్వామి నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యోగా గురూజీ ఇల్లూరు వెంకట శెట్టి పాల్గొన్నారు. లెక్చరర్లు రామకృష్ణ, జబీన్ అక్తర్, పార్థసారథి పటేల్, సోమేష్, సుజాత, లక్ష్మి, ఉల్గోజి రావు, శ్రీధర్, బాల శంకర్, శ్రావణి, జసింత పాల్గొన్నారు.

రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం తేవాలి

- రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం తేవాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. కర్నూలులోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పంలో రజక శిరీషపై దాడి సిగ్గుచేటన్నారు. సాక్ష్యాత్తు సిఎం నియోజకవర్గం కుప్పం నియోజకవర్గం నారాయణ పురం గ్రామంలో భర్త చేసిన అప్పు రూ.80 వేలు కట్టాలని రజక మహిళ శిరీషను చెట్టుకు కట్టేసి కొట్టడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిందన్నారు. ఇలాంటి అకృత్యాలకు అంతే లేకుండా పోయిందన్నారు. అగ్రవర్ణాలకు ఈ ఘటన జరిగి ఉంటే ఈపాటికి రాష్ట్రమంతా కూడా అల్లాడిపోయేదన్నారు. అందుకే రజకులకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మాదిరిగా సామాజిక రక్షణ చట్టం తీసుకురావాలని కోరుతున్నామన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని ఉంటే రజకులపై దాడులు చేయాలంటే ఆలోచించే పరిస్థితి ఏర్పడేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, హోం మంత్రి స్పందించి తక్షణమే నిందితులను అరెస్టు చేసి శిక్షించాలని బాధ్యతలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు ముక్కన్న, జిల్లా ఉపాధ్యక్షులు శేషాద్రి, ట్రెజరర్ సిహెచ్ శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి సి జయమ్మ, రాముడు, ఉపాధ్యక్షులు పర్ల సుంకన్న, శేఖర్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశం మాట్లాడుతున్న గురుశేఖర్

లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్యామ్‌కుమార్

సిఎం సహాయనిధి పేదలకు వరం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పత్తికొండ

నిరుపేద కుటుంబాలకు సిఎం సహాయ నిధి పేదలకు ఒక వరం లాంటిదని పత్తికొండ ఎమ్మెల్యే కెఈ.శ్యామ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం పత్తికొండ టిడిపి కార్యాలయంలో సిఎం సహాయ నిధికి అర్హులైన 28 మంది లబ్ధిదారులకు రూ.25 లక్షల విలువైన చెక్కులను అందజేసి ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. ఆరోగ్యశ్రీ వర్తించని వైద్య సేవలు కూడా సిఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని అన్నారు. లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ రుణపడి ఉంటామని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ బత్తిని వెంకటరాముడు, తిరుపాల్ నాయుడు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

- న్యాయవాది శ్రీనివాసులు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని సీనియర్ న్యాయవాది దాశెట్టి శ్రీనివాసులు తెలిపారు. నచ్చిన క్రీడల్లో ప్రవేశం పొంది పతకాలు సాధించే వారికి ఉద్యోగాల్లో ప్రభుత్వం రెండు నుంచి మూడు శాతానికి పెంచుతూ స్పోర్ట్స్ కోటాను ప్రకటించిందన్నారు. గురువారం జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన అంతర్ పాఠశాలల షూటింగ్ బాల్ పోటీలు, కబడ్డీ పోటీల ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలను వృత్తిగా నమ్ముకునే వారికి భవిష్యత్తులో మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈనెల 23న జరిగే ఒలంపిక్ రన్‌లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి జి.శ్రీనివాసులు, రాష్ట్ర యోగా సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి, హ్యాండ్ బాల్ సంఘం రాష్ట్ర కోశాధికారి రుద్రా రెడ్డి, షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఈశ్వర్ నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు లోకేష్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

'క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి'

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం సమన్వయకర్త డాక్టర్ మహేశ్వర్, ప్రసాద్ తెలిపారు. గురువారం ఓర్వకల్లు మండలం మీదివేముల గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ నాగరాజు, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, సామాజిక ఆరోగ్య అధికారి శారద, ఆరోగ్య కార్యకర్త మేరీ, ప్రాజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

'తల్లికి వందనం' చారిత్రాత్మక నిర్ణయం

- ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

చిత్రపటాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

తల్లికి వందన పథకం చారిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. తల్లికి వందనం పథకం పొందిన ప్రతి తల్లికీ పాదాభివందనమని టిడిపి మహిళా నాయకులు విజయలక్ష్మి చెప్పారు. గురువారం తల్లికి వందనం పోస్టర్ గల చిత్రపటాలను ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలోనూ తల్లికి వందనంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. నియోజకవర్గం 99 శాతం మంది విద్యార్థులకు 'తల్లికి వందనం' అందించిన ఘనత ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డికి దక్కుతుందని చెప్పారు. విద్యార్థుల పట్ల గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం.. పథకాలకు షరతులు పెట్టి విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారంలో పడేసిందని విమర్శించారు. ఇప్పుడు లబ్ధి పొందిన విద్యార్థుల తల్లిదండ్రులు కళ్లలో ఆనందం చూసి వైసిపికి మింగుడు పడడం లేదని మండిపడ్డారు. ప్రతి పాఠశాలకూ వెళ్లి 'తల్లికి వందనం'పై అవగాహన కల్పించారు. తల్లికి వందనం పోస్టర్ గల చిత్రపటం అందజేశారు. ఉపాధ్యాయులతో మాట్లాడి ఏవైనా సమస్యలుంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. విద్యార్థులతో ముచ్చటించి ప్రభుత్వం అందించిన పుస్తకాలు, బ్యాగులను పిల్లలకు పంపిణీ చేశారు.

మోకాళ్లపై నిలబడి

మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

మోకాళ్లపై నిలిచి నిరసన చేపడుతున్న కార్మికులు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్టు కార్మికులు నిరసనను ఉధృతం చేశారు. పట్టణంలోని భీమాస్ కూడలిలో నిర్వహించిన నిరసన శిబిరం గురువారం 16వ రోజుకు చేరింది. చాలీచాలని వేతనాలతో అర్ధాకలితో ఎన్నాళ్లు అంటూ మోకాళ్లపై నిలిచి నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. శిబిరానికి మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, చలపతి, ఫయాజ్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, కిశోర్, గోవిందు, రెహమాన్‌లు కార్మికులకు పూలమాల వేసి ఖర్చులకు రూ.5 వేలు ఇస్తూ సంఘీభావం తెలిపారు. నాయకులు, కార్మికులు పీరా, అహ్మద్, సోమన్న, కృష్ణమూర్తి, శంకర్, శరత్, రామాంజి ఉన్నారు.

12 గంటల పని విధానాన్ని రద్దు చేయాలి

- 20న ధర్నాలు, నిరసనలను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సమావేశంలో మాట్లాడుతున్న గోవిందు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిర్ణయించిన 12 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు, ఐఎఫ్‌టియు కార్యదర్శి కె.హనీఫ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఐఎఫ్‌టియు తాలూకా కార్యదర్శి ఎస్.బాలరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్మికులు ప్రపంచవ్యాప్తంగా 8 గంటల పని విధానం కోసం ప్రాణాలర్పించారని, సామ్రాజ్యవాదులు దిగొచ్చి 8 గంటల పని విధానానికి అంగీకరించారని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బ్రిటీష్ ప్రభుత్వ విధానాలను అనుసరించి మోడీ విధానాలకు అనుసరించి 12 గంటల పని విధానంపై మంత్రిమండలిలో నిర్ణయం చేయడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వం 8 గంటల పని విధానాన్ని రద్దు చేస్తే కార్మికులు ఉద్యమాలను ఉధృతం చేస్తారని తెలిపారు. 20న ధర్నాలు, నిరసనలను కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. నాయకులు ఎం.సత్తన్న, కె.కృష్ణ, యు.రమేష్, ఎస్.మోహిన్ పాల్గొన్నారు.

నాటుసారా తయారీ సామగ్రి ధ్వంసం

ప్రజాశక్తి - ఆదోని

సారా సామగ్రిని ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఆదోని శివారు ప్రాంతాల్లో నాటు సారా స్థావరాలపై దాడులు చేసి సామగ్రిని ధ్వంసం చేశామని ఆదోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ సైదుల్ తెలిపారు. నవోదయం 2.0లో భాగంగా గురువారం ఆదోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రణమండల కొండల్లో 450 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఆదోనిలోని వాల్మీకి నగర్‌కు చెందిన బోయ కార్తీక్‌పై కేసు నమోదు చేశామని సిఐ తెలిపారు.

ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

- దళిత, ప్రజాసంఘాల నాయకులు
- నేడు ఆదోనిలో దళితుల ఆత్మగౌరవ ర్యాలీ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో మాట్లాడుతున్న నాయకులు

ఆదోని మండలం ధణాపురం సర్పంచి చంద్రశేఖర్ పట్ల కుల వివక్ష ప్రదర్శించిన ఎమ్మెల్యే పార్థసారథి, టిడిపి నాయకులు గుడిసె ఆది కృష్ణమ్మపై చర్యలు తీసుకోవాలని దళిత, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్ ఆవరణలో దళిత, గిరిజన, ప్రజా సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. మండలంలోని ధణాపురం గ్రామంలో సర్పంచి చంద్రశేఖర్‌ను అవమానపరిచే విధంగా వ్యవహరించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. శుక్రవారం పట్టణంలో దళితుల ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదోని మున్సిపల్ మైదానం నుంచి అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని, నివాళులర్పించి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. అక్కడే ఉన్న పోలీసు స్టేషన్‌లో ఎమ్మెల్యే పార్థసారథి, గుడిసె ఆది కృష్ణమ్మపై ఫిర్యాదు చేస్తామన్నారు. సర్పంచి చంద్రశేఖర్ మాట్లాడుతూ... సర్పంచి పదవి కన్నా కుల ఆత్మగౌరవమే ముఖ్యమని, అవసరమైతే పదవికి రాజీనామా చేసి దళిత నాయకుల వెంటే నడుస్తానని తెలిపారు. సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ దేవదాసు, వైసిపి నాయకులు శ్రీలక్ష్మి, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు జై భీమ్ సాయిరాం, ఎంఐఎం ఆదోని ఇన్‌ఛార్జీ జునైద్, కౌన్సిలర్ చలపతి, కెవిపిఎస్ నాయకులు ముని, గిరిజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ సూరి, బీఎస్పీ నాయకులు నీలకంఠ, జై భీమ్ నాయకులు సురేష్, నాగరాజు, తారక్ శంకర్, నాయకులు గోవిందు, విజయ్, దేవదాసు, గంగాధర్, బొబ్బిలి, గిరి ఉన్నారు. **కౌతాళం**లోని అంబేద్కర్ సర్కిల్‌లో కెవిపిఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో రస్తారోకో నిర్వహించారు. కెవిపిఎస్ నాయకులు చిన్న మారయ్య, వీరేష్, దళిత సంఘం నాయకులు పాల్ దినకరన్, అవతారం, దేవదాస్, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య, మండల కార్యదర్శి బి.ఈరన్న మాట్లాడారు. ఎమ్మెల్యే పార్థసారథి, గుడిసె కృష్ణమ్మపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

కౌతాళంలో రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్ర బాబు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం

- డీఎస్పీ ఉపేంద్ర బాబు

ప్రజాశక్తి - కౌతాళం

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఎం.ఉపేంద్ర బాబు తెలిపారు. గురువారం మండలంలోని హాల్వి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, మంచి అలవాట్లను కలిగి ఉండాలన్నారు. చదువులో పోటీ తత్వంతో ముందుకు సాగి లక్ష్యాన్ని చేరుకోవాలని తెలిపారు. ప్రతి దశలోనూ కష్టపడితే భవిష్యత్తు బంగారు బాట అవుతుందన్నారు. అనంతరం ఫ్యాక్షన్ గ్రామాలైన నదిచాగి, రౌడూర్‌ను తనిఖీ చేశారు. పోలీసు సిబ్బందిని తగిన సూచనలు చేశారు.

శ్రీమఠంలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో భక్తుల కోలాహలం నెలకొంది. గురువారం రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై మంత్రాలయం వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి, మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో ఘనంగా పల్లకోత్సవం నిర్వహించారు.

మంత్రాలయం, పంచముఖికి బస్సు

ప్రజాశక్తి - మంత్రాలయం

బస్సును ప్రారంభిస్తున్న డిఎం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం నుంచి కర్ణాటక రాష్ట్రంలోని పంచముఖి ఆంజనేయ స్వామి దేవాలయానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు ఎమ్మిగనూరు ఆర్‌టిసి డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు తెలిపారు. గురువారం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ నుంచి పంచ ముఖికి బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల కడప జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు ఇక్కడ అభివృద్ధి పనులను పరిశీలించి సర్వీసు వివరాలు అడిగి తెలుసుకున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో కొందరు పంచముఖి పుణ్యక్షేత్రానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారని, స్పందించిన ఆయన తనను ఆదేశించారని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం పంచముఖికి బస్సును ప్రారంభించామని చెప్పారు. అసిస్టెంట్ మేనేజర్ ఎల్లప్ప ఉన్నారు.

అమృత టెస్టు బేబీ సెంటర్లో 50 శాతం డిస్కౌంట్‌తో ఐవిఎఫ్, ఐయుఐ

- ల్యాప్రోస్కోపి సర్జన్, గైనకాలజిస్ట్ డాక్టర్ ఈ.విజయ లక్ష్మి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

సంతానలేమితో బాధపడే వారికి కర్నూలు నగరం గాయత్రి ఎస్టేట్ ఎస్‌బిఐ లైన్‌లో ఉన్న అమృత టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్లో 50 శాతం డిస్కౌంట్‌తో ఐవిఎఫ్, ఐయుఐ సేవలు అందిస్తున్నట్లు ప్రముఖ ల్యాప్రోస్కోపి సర్జన్, గైనకాలజీ డాక్టర్ ఈ.విజయలక్ష్మి ప్రజాశక్తితో అన్నారు. ఆమె మాట్లాడుతూ అమృత హాస్పిటల్ వార్షికోత్సవం సందర్భంగా సంతానం లేమితో బాధపడే వారికి మాతృత్వ మాధుర్యాన్ని అందుకోవడం కోసం అమృత టెస్ట్ బేబీ సెంటర్ ఈ అవకాశాన్ని కల్పిస్తుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఉచిత కన్సల్టేషన్, ఉచిత స్కానింగ్, ఉచిత కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని, ల్యాబ్ టెస్టుల నందు 10 నుంచి 25 శాతం రాయితీ ఇస్తున్నామని తెలిపారు. ఈ అవకాశం జూన్ 15 నుంచి జూలై 15 వరకు ఉంటుందని, రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి మాత్రమే ఈ డిస్కౌంట్ వర్తిస్తుందని ఆమె తెలిపారు. అపాయింట్మెంట్ కోసం 08518 232046, 229398, 7671894442 నంబర్లలో సంప్రదించగలరని తెలిపారు.

25న నగర మహాసభలను జయప్రదం చేయండి

- సిఐటియు నగర కార్యదర్శి విజయ రామాంజనేయులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఎపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) ఓల్డ్ సిటీ నగర కమిటీ మహాసభలు ఈనెల 25న రాజ్ విహార్ సెంటర్‌లోని అంబేద్కర్ భవన్‌లో జరుగుతున్నాయని, జయప్రదం చేయాలని సిఐటియు నగర కార్యదర్శి విజయ రామాంజనేయులు, ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) ఓల్డ్ సిటీ కార్యదర్శి పి.మహమూద్ కోరారు. గురువారం చిన్న పార్క్, బాలాజీ హాస్పిటల్, మాసుంబాష దర్గా, జొహరాపురం పై ఆటోస్టాండ్ ఆటో కార్మికుల సమావేశం వారి అడ్డాలలో నిర్వహించారు. ఆటో యూనియన్ నగర ఉపాధ్యక్షులు దూదేకొండ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి సిఐటియు నిరంతర పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆటో కార్మికుల డిమాండ్లపై మహాసభలో చర్చించి తీర్మానాల ద్వారా ఆందోళనలు నిర్వహిస్తామని చెప్పారు. నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. అనంతరం ఆటో స్టాండ్ నూతన కమిటీలను ఆటో కార్మికులు ఎన్నుకున్నారు. ఆటో యూనియన్ నగర అధ్యక్షులు రవి, నాయకులు త్యాగరాజు, నూర్ బాషా, రామకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

- 44వ రోజుకు చేరిన ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీర్ కార్మికులు చేపట్టిన సమ్మె 44 రోజుకు చేరుకుంది. వెంటనే మున్సిపల్ ఇంజనీర్ కార్మికులకు న్యాయం చేయాలని గురువారం నగరంలో మున్సిపల్ కార్మికులందరూ అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. నగరంలో ఉన్న ప్రజలకు అందరికీ మంచి నీటిని అందిస్తున్న మాకు కనీసం బతకడానికి కావలసిన వేతనం కూడా అమలు చేయకుండా సంక్షేమ పథకాలను అమలు చేయకుండా కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్ రంగా, జావిద్ బేగ్, జిల్లా అధ్యక్షుడు మనోహర్, నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, శివ, వలి, భాష, కృష్ణ, జగదీష్, లక్ష్మణస్వామి కార్మికులందరూ పాల్గొన్నారు.

కర్నూలు నగరపాలక సంస్థ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ఈరన్న గౌడ్‌ను పరామర్శిస్తున్న బీవీ

ఈరన్నగౌడ్‌కు ఎమ్మెల్యే బీవీ పరామర్శ

ప్రజాశక్తి - నందవరం

నందవరం మాజీ జడ్‌పిటిసి, టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముగతి ఈరన్న గౌడ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి పరామర్శించారు. ఈరన్న గౌడ్ తల్లి, మాజీ ఎంపిపి ఈడిగ హనుమంతమ్మ ఈనెల 13న అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం ముగతి గ్రామంలోని ఈరన్న గౌడ్ నివాసానికి ఎమ్మెల్యే బీవీ చేరుకొని ఆయనను పరామర్శించారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ కురువ మల్లయ్య, క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఖాసీం వలీ, పూల చింత బండేగురు స్వామి, కన్వీనర్ చిన్న రాముడు, రైస్ మిల్లు నారాయణ రెడ్డి, నది కైరవాడి వీరేష్, ధర్మపురం గోపాల్, బ్రహ్మానంద రెడ్డి, భార్గవ్ యాదవ్, నాగలదిన్నె ఉరుకుందు, వీరారెడ్డి, జనసేన ఎల్లప్ప, పేట ఉదయ్ గౌడ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నందవరం

రామకృష్ణ (ఫైల్)

గుండెపోటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన నందవరం గ్రామంలో చోటుచేసుకుంది. కోట వీధికి చెందిన బోయ రామకృష్ణ (43) గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... రామకృష్ణ గురువారం ఉదయం 6 గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లిన వెళ్లి వస్తుండగా గుండెపోటుకు గురై కుప్పకూలి పడిపోయారు. అక్కడ ఉన్న వ్యక్తులు గమనించి వెళ్లి చూడగా అప్పటికే మరణించినట్లు గుర్తించారు. మృతునికి భార్య సుజాత, కుమారుడు రవి ఉన్నారు. రామకృష్ణ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ఉన్న ఒక్క కుమారుని ఆరోగ్య పరిస్థితి సరిగా లేదని వీధి ప్రజలు తెలిపారు. కొన్ని నెలల క్రితమే రవి వైద్య చికిత్సల నిమిత్తం సుమారు రూ.7 లక్షలు ఖర్చు చేసినట్లు చెప్పారు. కుటుంబం అప్పుల పాలైందని, రామకృష్ణ మృతి కుటుంబాన్ని శోకసంద్రంలోకి నెట్టిందని తెలిపారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బంధువులు కోరారు.

సమస్యలకు నిలయంగా పాఠశాల : ఆర్‌యుఎస్‌ఎఫ్

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చిలకలడోణ ఎస్సీ కాలనీలో ఉన్న ఎంపిపి పాఠశాల సమస్యలకు నిలయంగా మారిందని ఆర్‌యుఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్, ఆర్‌పిఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆఫ్రిద్ తెలిపారు. గురువారం వారు ఎంపిపి పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాఠశాలను సందర్శించినట్లు తెలిపారు. విద్యార్థులకు మురుగుదొడ్లు లేక ముళ్ల కంపలోకి పంపించడం దారుణమన్నారు. గతంలో ఉన్న ప్రధానోపాధ్యాయులకు మురుగుదొడ్లపై ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదన్నారు. విద్యార్థులకు మురుగు దొడ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వంటగదిని తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కట్టెల పొయ్యి మీద వంట చేయడం దారుణమన్నారు. పాఠశాల చుట్టుపక్కల ముళ్లకంపలను తొలగించాలని, లేకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

సేవలందించేందుకు ముందుకు రావాలి : డిప్యూటీ కమిషనర్

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీలక్ష్మి నరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో సేవా భావంతో భక్తులకు సేవలు అందించడానికి ఆసక్తి గల వారు ముందుకు రావాలని దేవాలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు కోరారు. గురువారం ఆయన మాట్లాడారు. జులై 25 నుంచి ఆగస్టు 23 వరకు శ్రావణమాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెలరోజుల పాటు జరిగే ఉత్సవాల్లో లక్షలాది భక్తులు స్వామి వారి దర్శనం కోసం వస్తుంటారని చెప్పారు. దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు సేవాభావం కలిగిన స్త్రీ, పురుషుల సేవలను వినియోగించుకోనున్నట్లు తెలిపారు. దేవస్థానం క్యూ లైన్ నిర్వహణ, ప్రత్యేక పూజలు/సేవలు, అన్నప్రసాద వితరణ, పార్కింగ్, హుండీ కౌంటింగ్, ఇతర చోట్ల స్వామి వారి సేవలో పాలుపంచుకోవాలని కోరారు. భక్తులు పేరు, అడ్రస్, మొబైల్ నెంబరు, ఏయే తేదీల్లో సేవకు రాగలరో తెలియజేస్తూ రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో కార్యనిర్వాహణ అధికారి, శ్రీలక్ష్మి నరసింహ ఈరన్న స్వామి దేవస్థానం, ఉరుకుందకు లిఖితపూర్వకంగా జులై 10లోపు వాట్సాప్ నెంబరు 95505 93339 ద్వారా కానీ, ఈ-మెయిల్ endow- eourukunda@gov.in ద్వారా కానీ, పోస్టు ద్వారా కానీ పంపవచ్చని తెలిపారు.

టిడిపి పట్టణాధ్యక్షులుగా రహంతుల్లా

ప్రజాశక్తి - గోనెగండ్ల

టిడిపి పట్టణాధ్యక్షులుగా రహంతుల్లా ఎన్నికయ్యారు. టిడిపి మండల, గ్రామ కమిటీల ఎన్నిక ప్రక్రియను గురువారం ఎమ్మిగనూరులో ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి చేపట్టారు. గోనెగండ్ల పట్టణాధ్యక్షునితో పాటు వివిధ గ్రామాల గ్రామ కమిటీ అధ్యక్షులను, టిడిపి బూత్ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలతో చేతులు ఎత్తడం ద్వారా ఎన్నుకున్నారు. టిడిపి పట్టణాధ్యక్షులుగా ఎం.రహంతుల్లా ఎన్నికయ్యారు. ఆయనకు పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

దళిత సర్పంచిపై వివక్ష దారుణం

- సిపిఎం సీనియర్ నాయకులు ఈరన్న

ప్రజాశక్తి - ఆదోని

దళిత సర్పంచి చంద్రశేఖర్ పట్ల కులవివక్ష ప్రదర్శించడం దారుణమని, ఎమ్మెల్యే పార్థసారథి, టిడిపి నాయకులు గుడిసె ఆది కృష్ణమ్మపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు ఈరన్న, పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మణ్, లింగన్న, కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, తిప్పన మాట్లాడారు. ఈనెల 16న మండలంలోని ధణాపురం గ్రామంలో కూటమి ఏడాది పాలనపై కార్యక్రమం నిర్వహించారని తెలిపారు. సర్పంచి చంద్రశేఖర్‌పై కులవివక్షత చూపుతూ ఎమ్మెల్యే, గుడిసె ఆదికృష్ణమ్మ ఎస్సీ అని సంబోధించి కించపరిచారని చెప్పారు. దేవాలయం దగ్గర సభ ఏర్పాటు చేసి దళిత సర్పంచి చంద్రశేఖర్‌ను ఆహ్వానించకుండా చివరిలో 'సర్పంచి వేదిక దగ్గరికి రావాల'ని పిలిచారన్నారు. పక్కనున్న గుడిసె ఆది కృష్ణమ్మ 'ఆయన ఎస్సీ.. ఇక్కడికి రాడు' అని చెప్పడంతో ఎమ్మెల్యే పార్థసారథి సైలెంట్ అయిపోయి చేయితో సైగ చేసి సర్పంచిని కిందనే నిలబెట్టారని తెలిపారు. కులం పేరుతో మాట్లాడిన ఎమ్మెల్యే, టిడిపి నాయకులు గుడిసె ఆదికృష్ణమ్మపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు రామాంజనేయులు ఉన్నారు. **ఎమ్మిగనూరు**లోని కెవిపిఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.తిమ్మన్న, చిన్నప్ప మాట్లాడారు. ఆదోని మండలం ధణాపురం గ్రామంలో దళిత సర్పంచిని అవమానించిన ఎమ్మెల్యే పార్థసారథి, టిడిపి నాయకులు గుడిసె కృష్ణమ్మపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చర్మ కళాకారుల సంఘం జిల్లా నాయకులు సుమాల ఆంథోని, కెవిపిఎస్ మండల నాయకులు రాజా రమేష్, ఉపాధ్యక్షులు సుమాల రాజు, ఎన్.గుంటప్ప, ఎస్.రాముడు, మనోహర్, ఎం.రంగన్న పాల్గొన్నారు. **కోసిగి**లో కెవిపిఎస్ మండల కమిటీ నాయకులు హనుమంతు, బోజప్ప, ఫిలిప్, మల్లి, నరసన్న మాట్లాడారు. **గోనెగండ్ల**లో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్ మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలో దళితులపై వివక్ష చూపుతూనే ఉందని, దళితులు అభివృద్ధి చెందకుండా చూస్తోందని విమర్శించారు. కెవిపిఎస్ నాయకులు కిష్టన్న, తిమ్మప్ప, రంగస్వామి, నాగన్న పాల్గొన్నారు.

ఆలూరు : దళిత సర్పంచిని అవమానించిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, టిడిపి నాయకులు గుడిసె కృష్ణమ్మలు బహిరంగ క్షమాపణ చెప్పాలని వైసిపి ఎస్సీ సెల్ జిల్లా నాయకులు కొట్టాల రాజు డిమాండ్ చేశారు. ఆలూరు ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. దళిత సర్పంచికి జరిగిన అవమానంపై కూటమి ప్రభుత్వం స్పందించి.. ఎమ్మెల్యే పార్థసారథి, గుడిసె కృష్ణమ్మపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. ఘటనపై దళిత సంఘాలు స్పందించి రాష్ట్రవ్యాప్త ఆందోళనకు సిద్ధం కావాలని కోరారు. వైసిపి నాయకులు వీరాంజనేయులు, సోము, కల్యాణ్ పాల్గొన్నారు.

ఆదోనిలో మాట్లాడుతున్న ఈరన్న

ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న తిమ్మన్న

ఆలూరులో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

గోనెగండ్లలో మాట్లాడుతున్న కరుణాకర్

'ఆర్‌ఎస్' ఇనిస్టిట్యూట్‌పై చర్యలు చూసుకోవాలి

- సబ్ కలెక్టర్‌కు ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి - ఆదోని

సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆర్‌ఎస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కాలేజ్ నిజానిజాలు నిగ్గు తేల్చి ఇనిస్టిట్యూట్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కోరారు. గురువారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడారు. ఆర్‌ఎస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కూల్ యాజమాన్యంపై పలు అనుమానాలు, ఆరోపణలు ఉన్నాయని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలోని ఆర్‌ఎస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కూల్‌కు ఎలాంటి అనుమతులూ లేవని తెలిసిందన్నారు. అడ్మిషన్ పొంది చదువుకుంటున్న విద్యార్థుల భవిష్యత్తు అంధకారం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తూ అర్హత లేని వారితో చదువు చెప్పిస్తున్నారని, విద్యార్థులు నాణ్యమైన విద్య పొందక నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ముందే అడ్మిషన్లు ప్రారంభిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులని మోసం చేశారనే అనుమానం ఉందని చెప్పారు. బుధవారం వైద్యాధికారులు తనిఖీకి వచ్చిన నేపథ్యంలో అప్పటికప్పుడు వేరే కళాశాల భవనాన్ని చూపించి బురిడి కొట్టించారని విమర్శించారు. విచారణ చేపట్టి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, కళాశాల భవనం యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఉత్తేజ్, లోకేష్, ఉదయ్, ఉచ్చీరప్ప పాల్గొన్నారు.

ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎ రెన్యువల్ చేయాలి

- తహశీల్దార్‌కు ప్రజల వినతి

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఆర్‌డిటి సంస్థకు ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులర్ యాక్ట్ (ఎఫ్‌సిఆర్‌ఎ)ను ప్రభుత్వం పునరుద్ధరించాలని మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. బుధవారం గోనెగండ్లలోని ఆస్పత్రి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. తహశీల్దార్ పి.రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ప్రజలు మాట్లాడుతూ... ఆర్‌డిటి సంస్థ రాష్ట్రంలో గ్రామీణ పేదలకు విద్య, వైద్యం, నూతన గృహ నిర్మాణాలు, తాగునీటి వసతి లాంటి సౌకర్యాలను కల్పిస్తోందని తెలిపారు. కొద్ది నెలలుగా కేంద్ర ప్రభుత్వం ఆర్‌డిటి సంస్థకు విదేశీ నిధులు అందకుండా ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెన్యువల్‌ను నిలిపివేసిందని చెప్పారు. ఫలితంగా సంస్థ నిర్వహించే పలు రకాల కార్యక్రమాలు నిలిచిపోయి పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని కోరారు. వెముగోడు బాబు భాస్కర్, చిన్నమరివీడు బజారి, ఒంటెడుదిన్నె సుధాకర్ పాల్గొన్నారు. **కోసిగి** వాల్మీకి సర్కిల్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. వివిధ గ్రామాల ప్రజలు, సిపిఐ, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు మద్దతు తెలియజేసి శాంతి యుత ర్యాలీలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ... నియోజకవర్గంలో 556 ఇళ్లు నిర్మించారని, 26 పాఠశాలలకు అదనపు గదులు ఏర్పాటు చేశారని తెలిపారు. **కౌతాళం**లో దళిత సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. దళిత సమాఖ్య నాయకులు విజయ్ కుమార్, జై భీమ్ నాయకులు అవతారం, సర్పంచి పాల్ దినకరన్, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆనంద్ మాట్లాడారు. ఆర్‌డిటి సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వివిధ గ్రామాల ఆర్‌డిటి సిడిసి నాయకులు మురళీ, ముఖేష్, గుడికంబాలి మారెప్ప, సులేకేరి, లింగాలదిన్నె నాగరాజు, ఎరిగేరి చిన్న, రౌడూర్ ముఖేష్ పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలం సూగూరు, తిమ్మాపురం, వగరూరు, మాధవరం గ్రామాలకు చెందిన ఆర్‌డిటి సంస్థ నుంచి లబ్ధి పొందిన లబ్ధిదారులు అంబేద్కర్ సర్కిల్ నుంచి రాఘవేంద్ర సర్కిల్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. సూగూరు ఉప సర్పంచి గోపీనాథ్, రవి, అంజి, ప్రభాకర్, శ్రీనివాస్ నాయక్, సుధా, వగరూరు దానియేలు పాల్గొన్నారు. **మద్దికెర :** పేదల అభ్యున్నతికి ఆర్‌డిటి చేస్తున్న సేవలను కొనసాగించేందుకు కృషి ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు ఆనంద్ కుమార్ కోరారు. గురువారం మద్దికెరలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు రాంబాబు, ఏసన్న, నాగరాజు పాల్గొన్నారు.

గోనెగండ్లలో తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

కోసిగిలో...

హోళగుంద మండలంలో వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

IN THE COURT OF THE SECOND ADDITIONAL DISTRICT JUDGE OF KURNOOL AT ADONI.
A.S. 10 OF 2024

Between:-
D.Umamaheshwar Rao and others.
...Appellants
Versus
B.N.Hanumanthappa and others.
...Respondents

Notice

To,
Respondent No. 10
Chamundeshwari w/o Raviprasad Naidu, Hindu aged about 55 years, R/o Gorantla Village, Kodumur Mandal.
...Respondent

Sir,
Appellants have filed the above appeal against decree and judgment in O.S.166/2009 on the file of Senior civil Judge court, Adoni in respect of suit schedule property. Take notice that honorable court has ordered substitute service of summons to you. You have to appear before the above mentioned court on 23.7.2025 at 10.30 am, either personally or through your advocate and file objections if any. Otherwise the appeal will be decided in your absence.

C.Giridhar
Advoce for appellants